ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 22 ఆగస్టు 2025



మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో సిస్టం : ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు, మండపాల ఏర్పాటు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'అనుమతులకు సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చాం. అనుమతులకు ఎలాంటి రుసుం చెల్లించనక్కర్లేదు. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులు సంబంధిత పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో పురపాలిక, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ సిబ్బంది బృందంగా మండపాల ఏర్పాటు చేయు ప్రదేశాలను సందర్శిస్తారు. నిబంధనల మేరకు అనుమతి మంజూరు చేస్తార'ని ఎస్పీ తెలిపారు.

దివ్యాంగుల దీనగాథ

'సదరం' సర్టిఫికెట్ల పునఃపరిశీలనతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. శతశాతం దివ్యాంగం ఉన్నవారిని సైతం సర్టిఫికెట్ల పునఃపరిశీలన చేయించాలని ఇటీవల సచివాలయ సిబ్బంది నోటీసు లివ్వడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్-రిమ్స్), టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రి, పలాసలోని ప్రభుత్వాసుపత్రికి పలువురు దివ్యాంగులు ఆపసోపాలు పడి చేరుకున్నారు. పునఃపరిశీలన కోసం గంటల తరబడి నిరీక్షించి ఇబ్బందులు పడ్డారు. తమపై అధికారులకు మానవత్వం లేదా అని ప్రశ్నిస్తున్నారు. వైద్యబృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి.. పునఃపరిశీలన చేయాలని కోరుతున్నారు.


శ్రీకాకుళం రిమ్స్‌లో ధ్రువపత్రాల పునఃపరిశీలనకు హాజరైన దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు

- సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలనలో అవస్థలు
- సరైన ఏర్పాట్లు చేయని అధికారులు
- రిమ్స్‌లో సాంకేతిక సమస్యతో గంటలకొద్దీ నిరీక్షణ



● ఈయన పేరు మళ్ల గిరిబాబు. నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ భరణిగాం గ్రామం. ఈయన శతశాతం దివ్యాంగత్వంతో మంచానికే పరిమితమయ్యారు. అయితే సంబంధిత సచివాలయ సిబ్బంది నెలవారీ దివ్యాంగ పింఛన్ పొందాలంటే సదరం సర్టిఫికెట్ రీ-వెరిఫికేషన్‌కు వెళ్లాలని ఇటీవల నోటీసు ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు గిరిబాబును గురువారం టెక్కలిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తీసుకువచ్చి వ్యయప్రయాసకు గురయ్యారు. కాగా ఇటీవల ప్రజాదర్బార్‌లో మంత్రి అచ్చెన్నాయుడు వద్దకు కూడా గిరిబాబును కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. శతశాతం దివ్యాంగం కలిగినఆయనకు నెలవారీ ఇస్తున్న పింఛన్ పెంచాలని కోరారు.

● నందిగాం మండలం కర్లపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొంచాడ తేజేశ్వరరావు ఆర్థో, న్యూరో సమస్యలతో మంచం పట్టాడు. సచివాలయ సిబ్బంది సదరం సర్టిఫికెట్లు రీ-వెరిఫికేషన్ చేయించాలని చెప్పారు. దీంతో ఎన్నో కష్టాలు పడి కుటుంబ సభ్యుల సహకారంతో గురువారం టెక్కలిలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి చేరుకున్నాడు.



స్లాట్ సమయమిచ్చి.. కానరాని వైద్యాధికారులు


పలాస ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్యాధికారుల కోసం నిరీక్షిస్తున్న దివ్యాంగులు

పలాస, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో పలువురు దివ్యాంగులకు పింఛన్లు రద్దయ్యాయి. మళ్లీ కొత్తగా సదరం సర్టిఫికెట్లు పొందేందుకు గురువారం స్లాట్ ద్వారా పునఃపరిశీలన కోసం సమయం కేటాయించారు. ఈ మేరకు 20 మందికిపైగా దివ్యాంగులు అతి కష్టంపై పలాస ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. సదరం కేంద్రం వద్ద గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వైద్యాధికారుల కోసం నిరీక్షించారు. కానీ వారికి ఎవరి నుంచి సమాధానం దొరకలేదు. చివరకు సంబంధిత వైద్యాధికారులకు వేరే ఆసుపత్రి విధులు కేటాయించారని, మళ్లీ ఎప్పుడు సదరం సర్టిఫికెట్లు ఇస్తారో చెబుతామని సిబ్బంది చెప్పడంతో వారంతా తీవ్ర నిరాశ చెందారు. తమకు పింఛన్ అందుతుందో లేదోనని ఆవేదన చెందుతున్నారు. సదరంలో నమోదైన వివరాలు, స్లాట్ బుకింగ్‌పై జిల్లా వైద్యాధికారుల నుంచి స్థానిక వైద్యాధికారులకు ఎటువంటి సమాచారం రాలేదని చెబుతున్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు వద్ద ప్రస్తావించగా.. 'రద్దయిన పింఛన్లను పునరుద్ధరించడానికి కొత్తగా సదరం ద్వారా దివ్యాంగుల ధ్రువీకరణ కోసం స్లాట్ ద్వారా సమయం కేటాయించాం. వైద్యులు ఏ కారణాల వల్ల రాలేదో మాకు తెలియదు. మొత్తం 27 మంది పింఛన్లు రద్దయ్యాయి. ఇందులో ఐదు పింఛన్లను వృద్ధాప్య పింఛన్లుగా మార్చాం. మిగిలిన 22 మంది సంబంధిత దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే పింఛన్లు పునరుద్ధరిస్తామ'ని తెలిపారు.

శ్రీకాకుళం రిమ్స్/ టెక్కలి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ ధ్రువపత్రాలతో చాలామంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు పొందారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రక్షాళన దిశగా చర్యలు చేపడుతోంది. 'సదరం'లో భాగంగా దివ్యాంగుల ధ్రువపత్రాలు పునఃపరిశీలన చేయాలని అధికారులను ఇటీవల ఆదేశించింది. మరోవైపు పింఛన్‌దారులకు కూడా సచివాలయ సిబ్బంది ద్వారా నోటీసులు అందజేసింది. ఈ మేరకు గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన (మిగతా 6వ పేజీలో..)

జానపదానికి పూర్వ వైభవం

- విభిన్న కళల్లో రాణిస్తున్న కళాకారులు
- నేడు అంతర్జాతీయ జానపద దినోత్సవం

6లో

శ్రీకాకుళంలో స్పెషల్ కోర్టు ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం

ఇక స్మార్ట్‌గా..

- నెలాఖరుకు కొత్త రేషన్ కార్డులు
- క్యూఆర్ కోడ్‌తో రూపకల్పన
- కొత్త విధానంలోనే రేషన్ పంపిణీ

6లో

ఆడపడుచులపై దుష్ప్రచారం దారుణం

- తప్పుడు ప్రచారం చేసేవారిని వదిలే ప్రసక్తే లేదు
- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

7లో

నాన్నా.. ఎందుకిలా చేశావు?

- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి ఆత్మహత్య
- ఫరీదుపేటలో విషాదఛాయలు
- విలపించిన కుటుంబ సభ్యులు


నరసింహనాయుడు(ఫైల్)

ఎచ్చెర్ల/ వేంపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలిసి.. 'ఎందుకిలా చేశావు నాన్నా'.. అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గురువారం జరిగిన ఈ విషాదకర సంఘటనకు సంబంధించి ట్రిపుల్‌ఐటీ అధికారులు, విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట గ్రామానికి చెందిన జి.అప్పలనాయుడు, జి.రాజులమ్మ దంపతుల కుమారుడు గురుగుబెల్లి నరసింహనాయుడు(17) ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహనాయుడుకు గతేడాది ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చింది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఉంటూ ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజులుగా ముభావంగా ఉన్నట్లు తోటి విద్యార్థులు చెబుతున్నారు. ట్రిపుల్‌ఐటీలో చదవడం ఇష్టం లేదని, బైపీసీ చేసి తల్లిలాగా నర్సింగ్ కోర్సు చదవాలని ఉందంటూ అప్పుడప్పుడు తమతో చెప్పేవాడన్నారు. భవనంపై నుంచి దూకితే మనిషి చనిపోతాడా? అని కొద్దిరోజుల కిందట మాటల సందర్భంలో స్నేహితులతో అన్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున బాత్‌రూములోకెళ్లి బట్టలు ఆరేసుకునే తాడుతో ఉరేసుకున్నాడు. 7.30గంటల సమయంలో నరసింహనాయుడు ఉరివేసుకున్నట్లు క్యాంపస్ సిబ్బంది, విద్యార్థులు గుర్తించారు. కాగా అప్పటికే విద్యార్థి మృతిచెందాడు. మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా వేంపల్లె వైద్యశాలకు తరలించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త, పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ ఇతర అధికారులు మృతదేహాన్ని పరిశీలించారు. తల్లి రాజులమ్మకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కేవ్యాలీ ఏఎస్ఐ నాగరాజ తెలిపారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా.. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ సభ్యుల్లో విషాదం

నర్సింహనాయుడు మృతి చెందినట్టు గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో లబోదిబోమంటూ ఇడుపులపాయకు బయలుదేరారు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. నరసింహనాయుడు తండ్రి అప్పలనాయుడు కొన్నేళ్ల కిందట మృతి చెందాడు. తల్లి రాజులమ్మ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు (మిగతా 6వ పేజీలో..)

వర్షం.. అంచనా తప్పుతోంది

- గతంలో 'తితలీ'ని గుర్తించడంలోనూ విఫలం
- అటూ ఇటుగా వాతావరణ సూచనలు
- ముప్పును పసిగట్టడంలో స్పష్టతలేని వైనం
- తాజా వాయుగుండం పరిస్థితీ అదే


శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం (ఫైల్)

శ్రీకాకుళం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి)

సిక్కోలు.. రాష్ట్రంలోనే సువిశాలమైన తీరప్రాంతం అధికంగా ఉన్న జిల్లాగా గుర్తింపు పొందింది. అయితే బంగాళాఖాతానికి ఆనుకుని జిల్లా ఉండటంతో తుఫాన్‌లు, వాయుగుండాల ప్రభావం తరచూ అధికంగా ఉంటోంది. ముప్పు పసిగట్టి.. ప్రజలను అప్రమత్తం చేసే విషయంలో సూచనలు చేస్తున్న వాతావరణ శాఖ లెక్క.. అంచనా తప్పుతోంది. ఇటీవల బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్‌అలర్ట్ ప్రకటించింది. అసాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని.. సరిహద్దుల్లో తీరం దాటనుండటంతో రెండు మూడు ప్రాంతాల్లో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని.. వెల్లడించింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తీరప్రాంతాల్లో మకాం వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. సోమ, మంగళవారాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సెలవులు కూడా ఇచ్చేశారు. కానీ, ఆదివారం భారీ వర్షం కురవగా, సోమ, మంగళవారాల్లో మాత్రం వాయుగుండం ప్రభావం జిల్లాపై పెద్దగా చూపలేదు. ప్రమాదం సంభవించకపోవడమే అన్ని విధాలా మేలు. కానీ వాతావరణ శాఖ సూచనలు అంచనా తప్పుతుండడం చర్చనీయాంశమవుతోంది.

● **'తితలీ' సమయంలోనూ విఫలం..**

జిల్లాలో ఉద్దానం ప్రాంత ప్రజలు 2018లో సంభవించిన తితలీ తుఫాన్ విలయాన్ని మరువలేరు. అప్పట్లో తితలీ తుఫాన్ ముప్పును అధికార యంత్రాంగం సరిగ్గా గుర్తించలేకపోయింది. వజ్రపుకొత్తూరు మండలం పల్లెసారథి ప్రాంతం వద్ద తుఫాన్ తీరం దాటింది. ఆ రోజు ఓవైపు భారీ వర్షం.. మరోవైపు ఈదురుగాలుల బీభత్సానికి ఉద్దానంలో కొబ్బరిచెట్లు, జీడిమామిడి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. ఒకవేళ తుఫాన్ ప్రభావం ముందుగా గుర్తించినా.. ప్రాణనష్టం మినహా.. ఇతర నష్టాలను ప్రకృతి వైపరీత్యం నుంచి కాపాడుకోవడం అంతటి సులభంకాదు. కానీ అంచనా వేయలేకపోవడం.. జిల్లాలో ఇంతటి విపత్తు సంభవిస్తుందని గుర్తించకపోవడం.. అప్పుడు చర్చనీయాంశమైంది. అప్పట్లో సీఎం చంద్రబాబు జిల్లాలోనే మకాం వేశారు. మంత్రులను, ఐఏఎస్ అధికారులను జిల్లాకు రప్పించి యుద్ధప్రాతిపదికన పునరావాస పనులు పూర్తిచేయించారు.

● **తుఫాన్‌లంటేనే వణుకు..**

తీరానికి ఆనుకుని ఉండటం.. సముద్రం నుంచి వీచే గాలులు.. తుఫాన్‌ల సమయంలో అల్పపీడనం.. వాయుగుండం.. ఇతర ముప్పులతో తరచూ జిల్లావాసులు వణుకుతున్నారు. 2014లో హుద్‌హుద్ తుఫాన్ విశాఖపట్నంలోనే కాదు శ్రీకాకుళం జిల్లాపై కూడా ప్రభావానికి గురైంది. కొన్ని రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలకు గురయ్యారు. నిత్యావసరాలకు సైతం ఇబ్బందులకు పడ్డారు. విపత్తులను ఎదుర్కొనే సత్తా ఉన్నా.. ముందుగానే అంచనావేసే కచ్చితమైన సమాచారం ఇచ్చే వ్యవస్థ.. ఇటు వాతావరణ శాఖ బలపడలేదని పలు సంఘటనలు నిరూపిస్తున్నాయి. వాతావరణ కేంద్రం నుంచి వెలువడే ప్రకటనలు.. పారదర్శకంగాను.. ప్రజలకు కచ్చితమైన సమాచారం అందించేలా.. మత్స్యకారులకు విపత్తుల నుంచి రక్షణ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

శ్రీకాకుళం ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌కు రూ.4.49 కోట్లు మంజూరు

శ్రీకాకుళం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ అభివృద్ధికి కీలక చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టులో భాగంగా సాధారణ సౌకర్యాల కేంద్రం(కామన్ ఫెసిలిటీ సెంటర్-సీఎఫ్‌సీ) ఏర్పాటు చేయడానికి తన వాటాగా రూ.4.49 కోట్లు (15శాతం) మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతి జారీ చేసింది. రాష్ట్ర పరిశ్రమల వాణిజ్య శాఖ ఆదేశాల ప్రకారం.. ఈ నిధులను ఏపీ సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్‌ఎంఈడీసీ) పీడీ ఖాతా నుంచి ప్రత్యేక జీరో-బేస్డ్ ఖాతాకు బదిలీ చేయనున్నారు. ఈ నిధులను కేవలం క్లస్టర్ అభివృద్ధి పనులకే వినియోగించాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎంఎస్‌ఈ-సీడీపీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఎస్‌పీఏసీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందింది. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తన వాటా విడుదల చేయగా.. ప్రాజెక్టు అమలు వేగవంతం కానుంది. ఈ నిధుల వినియోగంపై ఏపీఎంఎస్‌ఎంఈడీసీ ప్రధాన కార్యనిర్వహణాధికారి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.యువరాజ్ గురువారం జారీచేశారు.

రెప్పపాటులో విషాదం

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి
- కుటుంబ సభ్యుల్లో మిన్నంటిన రోదనలు

టెక్కలిపట్నంలో వ్యాపారి..


వెంకటరావు (ఫైల్)


పలాస, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పలాస మండలం టెక్కలిపట్నం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శాసనపురి వెంకటరావు(55) మృతి చెందారు. ఈయన కాశీబుగ్గలో నివాసం ఉంటూ గొప్పిలి గ్రామంలో హార్డ్‌వేర్ షాపును నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఆయన శ్రీకాకుళం నుంచి గొప్పిలి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా టెక్కలిపట్నం రోడ్డులో కుక్క అడ్డువచ్చింది. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో ఆయన తలకు తీవ్ర గాయాలై మృతి చెందారు. ఈయనకు భార్య సుగుణ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు.

శ్రీపురం జంక్షన్‌లో ఇద్దరు కూలీలు..

కోటబొమ్మాళి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చారు. కోటబొమ్మాళి మండలం శ్రీపురం జంక్షన్ సమీపంలో గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం దుప్పిలపాడు గ్రామానికి చెందిన సబ్బి అప్పన్న (38), పాకివలసకు చెందిన పిట్ట గంగయ్య(30) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. అప్పన్న అత్తవారి గ్రామం పాకివలస. అదే గ్రామానికి చెందిన పిట్ట గంగయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీపురం సమీపంలో ఉన్న దాబాలో భోజనం చేశారు. తిరిగి వారిద్దరూ పాకివలస వెళ్తుండగా రెప్పపాటులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. వారిద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అప్పన్నకు భార్య లావణ్య, పిల్లలు ప్రియాంక, హారిక, మణికంఠ ఉన్నారు. గంగయ్యకు భార్య వాణిశ్రీ, కుమార్తె నిఖిత్, కుమారుడు దీక్షిత్ ఉన్నారు. అప్పన్న, గంగయ్య ఇద్దరూ కూలి చేస్తూ కుటుంబాలను పోషించేవారు. ఇంటి పెద్దదిక్కులను (మిగతా 6వ పేజీలో..)


అప్పన్న, గంగయ్య (ఫైల్)

బుడుమూరులో వృద్ధుడు..


గోవిందరాజులు (ఫైల్)

లావేరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): లావేరు మండలం బుడుమూరు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొడ్డ గోవిందరాజులు(66) మృతి చెందారు. గోవిందరాజులది విశాఖపట్నం జిల్లా గాజువాక. ఈయన బుడుమూరులో నివాసం ఉంటున్న తన కుమార్తె ఇంటికి పదిరోజుల కిందట వచ్చారు. గురువారం ఉదయం తన కుమార్తె ఇంటి వద్ద నుంచి బహిర్భూమికని వెళ్తూ రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుండి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో గోవిందరాజులు అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు లావేరు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

'సర్వే' పనులు పూర్తిచేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'స్వామిత్వ భూమి రికార్డుల సర్వే పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. వర్క్‌ఫ్రమ్‌హోం కౌశల సర్వేను కూడా ఆలస్యం చేయకుండా ముగించాల'ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన సచివాలయం నుంచి కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్ర స్థూలఉత్పత్తి, ఎంఐ చెరువులు, భూగర్భ జలాలు, స్వచ్ఛాంధ్ర అవార్డులు, జువైనెల్ జస్టిస్ కమిటీలు, కోర్టుల్లో న్యాయాధికారుల నియామకం వంటి అంశాలపై సమీక్షించారు. 'అక్టోబరు 2న స్వచ్ఛాంధ్ర అవార్డులు ఇవ్వనున్నాం. 12 విభాగాల వారీగా రేటింగ్‌లు ఇవ్వాలి. సేవా సంస్థలను భాగస్వాములను చేయాలి. భూగర్భ జాలాలను పెంచే చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ పథకాల నమోదు పారదర్శకంగా ఉండాలి. సీపీవోలను నోడల్ అధికారులుగా నియమించాల'ని విజయానంద్ తెలిపారు. ప్రజలు ఐవీ ఆర్ఎస్ ద్వారా ఇచ్చిన అభిప్రాయాలపై కూడా సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జానపదానికి పూర్వ వైభవం

- విభిన్న కళల్లో రాణిస్తున్న కళాకారులు
- ప్రజల నుంచి పెరుగుతున్న ఆదరణ

నేడు అంతర్జాతీయ జానపద దినోత్సవం



జానపద కళలు.. ఈ పేరు చెబితే శ్రీకాకుళం జిల్లా పేరు ఠక్కున గుర్తుకు వస్తుంది. అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు రణస్థలం వరకు ప్రతి మండలంలోనూ ఏదో ఒక కళను పోషిస్తూ... ప్రజల్లోకి తీసుకెళుతున్న కళాకారులు ఎందరో... ఇటీవల కాలంలో వీటికి ఆదరణ పెరుగుతుండడం సంతోషాన్నిస్తోంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే... వీటిని కాపాడేందుకు మరింత కృషి చేస్తామని చెబుతున్నారు ఈ కళాకారులు.

కళాకారుడిగా రాణిస్తూ.. మరికొందరిని తీర్చిదిద్దుతూ...



రాజమ్మ వేషధారణలో ప్రకాష్ (ఫైల్)

కవిటి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంతరించి పోతున్న కళల్లో జానపద కళ కూడా ఒకటి. కొన్నాళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో ఉవ్వెత్తున ఎగసిపడింది ఈ కళ. మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ కళ ఉర్రూతలూగించేది. టీవీ, సినిమా, సెల్‌ఫోన్, వలసల పుణ్యమా అని ఈ కళకు ఆదరణ తగ్గుతూ వస్తోంది. ఇలాంటి పరిస్థితిలోనూ జానపద కళలను జనంలోకి తీసుకెళ్లడమే కాకుండా... మరికొంతమంది కళాకారులను తీర్చిదిద్దుతున్నాడు గేదెల ప్రకాష్. గొండ్యాలపుట్టుగ గ్రామానికి చెందిన ప్రకాష్ ఇంటర్ వరకు చదువుకున్నారు. తండ్రి నేర్పిన జానపద కళలను ఉపాధిగా మలచుకున్నారు. మరికొందరికి శిక్షణ ఇచ్చి కోయనృత్యం, ఎంకినాయుడు బావ, జాలరి అమ్మవారు, కోలాటం, రాజమ్మ వేషం వంటి జానపద కళలకు కొత్త రూపం ఇచ్చారు. అందరినీ ఆకట్టుకునేలా ప్రదర్శించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. జానపద కళలపై మక్కువ ఉన్న మత్స్యకార యువకులను ఒకచోటకు చేర్చి వారితో కోయనృత్య ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. ఉద్దానం కోయనృత్యాలకు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉంది. దాదాపు ఇరవై మంది పురుషులు కోయదొరలుగా, కోయ రాణులుగా వేషాలు వేసి నృత్యం చేయడం దీని ప్రత్యేకత. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్, అండమాన్ ప్రాంతాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చినట్టు ప్రకాష్ చెబుతున్నారు. రాజమ్మ వేషంతో చేసే నృత్యం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. ఈవేషధారణకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన జానపద పోటీలలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు ప్రకాష్. ప్రభుత్వం సహకారం అందించి కళాకారులకు గుర్తింపు కల్పిస్తే జానపదం జీవం పోసుకుంటుందని గేదెల ప్రకాష్ చెబుతున్నారు.

స్వయంకృషితో ముందుకెళుతూ..

ఇచ్ఛాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జానపదాలకు చిరునామా ఉద్దానం. ఈ ప్రాంతం నుంచి ఎంతో మంది జానపద కళాకారులుగా రాణిస్తున్నారు. ఇటీవల ముఖ్యంగా వినిపిస్తున్న పేర్లు మద్దిల నారాయణరావు, డి.నారాయణరావు. ఈ ప్రాంతంలో ఎటువంటి పండగలు, శుభకార్యాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలైనా ఈ ఇద్దరు కళాకారులు ఉండాల్సిందే. అంతగా ఆదరణ దక్కించుకున్నారు ఈ నారాయణ ద్వయం. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇటీవల వచ్చిన 'నా ఇచ్ఛాపురం ఇననగర' పాట ఎంతో ఆదరణ పొందుతోంది.

● వైకల్యాన్ని అధిగమించి..

ఇందులో డి.నారా యణరావు అనే కళాకారుడు అంధుడు. ఇచ్ఛాపురానికి కూతవేటు దూరంలోని బి.నౌగాం ఆయన స్వగ్రామం. ఉండేది ఒడిశా భూభాగంలో అయినా తెలుగు జానపదాలంటే చాలా మక్కువ. సాధారణంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు, పండుగ సమయాల్లో ఎక్కువ మంది జానపదాలు పాడుతుంటారు. అలా నారాయణరావు ఆ పాటలపై మక్కువ పెంచుకు న్నాడు. ఎటువంటి పాటనైనా అలవోకగా పాడడం అలవాటు చేసుకున్నాడు. మంచి గాత్రంతో జానపదాలకే ఇప్పుడు వన్నె తెస్తున్నాడు. డిగ్రీ చదువుతున్న నారాయణరావు ఇప్పటి వరకూ 21 ప్రైవేటు ఆల్బమ్‌లలో పాడాడు. ప్రస్తుతం స్టేజీ కళాకారుడుగా బిజీ అవుతున్నాడు. జానపదాలు అంటే తనకు ఇష్టమని.. ఎలాగైనా సినిమాల్లో పాడాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడు.

● మంచి గాత్రంతో..



నారాయణరావుల ద్వయం

మద్దిల నారాయణరావుది కంచిలి. ఆయన గత కొంత కాలంగా జానపదాలు పాడుతూ మంచి కళాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పటివరకూ వందలాది స్టేజీ ప్రదర్శనలు ఇచ్చారు. పదుల సంఖ్యలో ఆల్బమ్‌లలో పాడాడు. ప్రాథమిక స్థాయి నుంచి జానపదాలంటే చాలా ఇష్టం. ఎవరి దగ్గర శిష్యరికం చేయలేదు కానీ.. గ్రామంలో జానపదాలను విని అలవాటు చేసుకున్నానని చెబుతున్నాడు. అలా సాధన చేసి సొంతంగానే పాటలు పాడడం ప్రారంభించాడు. ఈ క్రమంలో విశాఖలోని ఓ రికార్డింగ్ కంపెనీలో పాడే సరికి ఆయనకు మరింత ఆదరణ పెరిగింది. ఎప్పటికైనా సినిమాల్లో పాడాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నారు నారాయణరావు.

తప్పెటగుళ్లు కేరాఫ్ ఎస్ఎం పురం

ఎచ్చెర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పల్లె సంస్కృతిలో భాగమైన వాయిద్యకళ తప్పెటగుళ్లు. తరతరాలుగా వస్తున్న జానపద కళకు ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం గ్రామం ప్రసిద్ధిచెందింది. ఇక్కడి తప్పెటగుళ్ల కళాకారులు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో కళను ప్రదర్శించి ఖ్యాతినార్జించారు. గ్రామ దేవతల పండగలు, సంబరాలు, ఎన్నికల ప్రచారం, పెళ్లిళ్లు, జాతరలు తదితర వాటిలో ఇక్కడి తప్పెటగుళ్ల కళాకారులు సందడి చేస్తుంటారు. ఈ కళను సజీవంగా ఉంచుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. తప్పెటగుళ్ల శబ్దం, ప్రత్యేకమైన శ్రుతి, లయ, ఉత్సాహంతో ప్రసిద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కూడా ఇక్కడి కళాకారులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సంబరాల్లో ఎక్కువగా కనిపించే తప్పెటగుళ్లకు ఈ ఆధునిక కాలంలో కూడా ఆదరణ తగ్గలేదు. ఎస్ఎంపురం గ్రామంలో సుమారు 300 మంది తప్పెటగుళ్ల కళాకారులు ఉన్నారు. 15 మందికి తక్కువ లేకుండా కళాకారులు బృందంగా ఏర్పడి ప్రదర్శించే ఈ కళ చూడముచ్చటగా ఉంటుంది. జిల్లాలో ఎస్ఎంపురంతో పాటు పెద్దపాడు, ముద్దాడ, అల్లినగరం, బుడుమూరు, బావాజీపేట, జొన్నలపాడు తదితర గ్రామాల్లో సుమారు 1200 మంది తప్పెటగుళ్ల కళాకారులు ఉన్నారు. ఏటా సంక్రాంతి మరుసటి రోజు నుంచి శివరాత్రి వరకు ఈ కళాకారులకు క్షణం తీరికలేకుండా గడుపుతారు.

ఎస్ఎం పురం కళాకారుల బృందం ప్రదర్శన (ఫైల్)



గంగిరెద్దుల విన్యాసాలు

కళలకు పుట్టినిల్లుగా...

టెక్కలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జానపదానికి శ్రీకాకుళం జిల్లా పుట్టినిల్లు. జిల్లాలో తప్పెటగుళ్ళ, చెక్కభజన, డప్పు కళాకారులు, గంగిరెడ్ల కళాకారుల నృత్యాలు, చెంచుల పగటివేషాలు, గిరిజన నృత్యాలు, హరిదాసులు, పులివేషాలు, ఎరుకులపాట, జముకులపాట, పండరీ భజన, శివభాగోతం, రామదాసు కీర్తనలు, కోలాటం.. ఇలా అనేక రకాల జానపద కళాకారులు ఈ జిల్లాలో ఐదువేల మంది వరకు ఉన్నారు. 1969లో సుబ్బారావు పాణిగ్రహి జముకులపాటతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఆయనతో పాటు వెంపటాపు సత్యం అదే కోవను అనుకరించారు. హరికథలో ధర్మపురి కృష్ణమూర్తి రాణించారు. మొత్తంగా జానపదాలకు పుట్టినిల్లు ఉద్దానం ప్రాంతం కాగా అందులో రంగోయి గ్రామానికి ప్రథమ స్థానం. అధ్యాపకులు బద్రి కూర్మారావు, ఉపాధ్యాయులు కుమార్‌నాయక్ వంటి వారు ఇప్పటికీ జానపద కళలను సజీవంగా ఉంచడానికి తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో ఒకప్పుడు తోలుబొమ్మలు వంటి జానపదాలు ఉన్నా రానురాను కనుమరుగయ్యాయి.

కళాప్రదర్శనలతో..

పలాస, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పలాస మండలం రంగోయి గ్రామం వేదికగా బద్రి అప్పన్న మెమోరియల్ జానపద కళాప్రదర్శన ద్వారా ప్రతీ ఏటా జనవరి 11, 12 తేదీల్లో నిర్వహిస్తు మన ఉత్తరాంధ్ర జానపద కళలకు జీవం పోస్తున్నారు. అలాగే విశ్వబ్రాహ్మణులకు గోత్రాలు, వంశనామాలు పొగిడి విశ్వకర్మపురాణాలు చెప్పేవారు రుంజాలుగా గుర్తింపు పొందారు. వీరు జిల్లాలో గార, అంపోలు, మామిడివలస, అడవవరం గ్రామాల్లో ఉన్నారు. జముకులపాటలు ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేకం. కుంచం ఆకారంలో ఉన్న డొక్కుకు కప్ప చర్మం వేసి మధ్యలో చిన్న రంధ్రం నుంచి తీగ తీసుకొని చివరకు కర్ర, చివరకు మువ్వలు పెట్టి లయబద్ధంగా దాన్ని వాయిస్తారు. దీన్నే జముకు అంటారు. కొన్ని ప్రాంతాల్లో బోనెలపాట అని కూడా పిలుస్తారు. విప్లవకవి సుబ్బారావు పాణిగ్రాహి జముకు వాయించుకొనే విప్లవాలను ప్రజలకు నూరిపోశారు. ఆయన పాటలు ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయి. బోనెల అసిరయ్య ప్రస్తుతం జముకు పాటలను పాడుతు సినిమాల్లో కూడా కనిపిపిస్తున్నారు.

సంప్రదాయ కళలను బతికించండి..



మన సంప్రదాయ కళలను మనమే రక్షించుకోవాలి. పండుగలు, ఉత్సవాల్లో ప్రదర్మలకు తీసుకోవడం కాదు. వారిని నిత్యం ప్రోత్సహిస్తుండాలి. ఇటువంటి కళలను రక్షించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలి. జానపదాల కోసం ప్రత్యేకంగా ఆడిటోరియం వంటివి నిర్మించి ప్రదర్మలు ఇస్తుంటే కొంతవరకూ ఫలితం ఉంటుంది.

-బద్రి కూర్మారావు, రిటైర్డ్ లెక్చరర్, జానపద కళాకారుడు

ప్రభుత్వాలు ఆదుకోవాలి..



జానపద కళారూపాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. కొన్ని జాతుల కళారూపాలను ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా పింఛన్ ఇవ్వాలి. అలాగే ప్రభుత్వ పథకాలు ప్రచారానికి జానపద కళాకారులను వినియోగించాలి.

-రెడ్డి గోవిందరావు, జానపద కళాకారుడు, బసివలస

జానపద కళలను ప్రోత్సహించాలి..



ఏడాదికి ఒకసారైనా జిల్లాస్థాయిలో జానపద కళారూపాలు ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాలి. దీనివల్ల ఈ కళలు అంతరించకుండా ఉంటాయి. ఉగాది, దసరా తదితర ఉత్సవాల్లో ప్రోత్సహకాలను అందిస్తే బాగుంటుంది.

-శిమ్మ లక్ష్మణరావు, జానపద కళాకారుడు, నారాయణవలస

పూర్వ వైభవానికి ప్రయత్నిస్తూ..

కంచిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మొదలుకొని వరుసగా వచ్చే హిందువుల పండుగలు గ్రామాల్లో సామూహికంగా జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ పూజల్లో భాగంగా ప్రతి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటి. ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాలు, దేవతల సంబరాల్లో జానపద కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించడం, వాటికి పెద్ద ఎత్తున యువత, మహిళలు ఆదరిస్తుండడంతో వీటికి పూర్వవైభవం వచ్చేలా కనిపిస్తోంది. గతంలో ప్రదర్శనలు ఇచ్చేటపుడు వృద్ధులు, కొంతమంది పెద్దలు తప్ప అంతగా ఆదరణ లభించేది కాదని, ఇప్పుడు తమ ప్రదర్శనలకు ఎక్కువ మంది రావడం ఆనందంగా ఉందంటున్నారు ఈ కళాకారులు. ప్రభుత్వం జానపద కళాకారులకు పింఛను వంటి సదుపాయాలు కల్పిస్తే..మరింతగా దీనిని జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని కళాకారులు చెబుతున్నారు.



శ్రీకృష్ణుడి వేషధారణలో పలాసపురం కళాకారుడు విశ్వనాథం

ప్రభుత్వం తోడ్పాటు అందించాలని..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి మండలం కర్తలితోపాటు సోంపేట, కవిటి మండలాల్లో అనేక కుటుంబాలు నేటికీ జానపదాలను నమ్ముకునే జీవనం సాగిస్తున్నారు. కర్తలిలో పైల వెంకయ్య గురువు ఆధ్వర్యంలో అనేక మంది జానపద కళను అభ్యసించారు. వీరిలో వాసాల మాదయ్య, పైల భగీరధి, బోర రాజా, వాసాల రమేష్ రెడ్డి తదితరులు గ్రామాల్లో రామ నాటకం, గరుడ శాల, కోయ నృత్యం, భూమి బాగోతం, పాండురంగ భజన, సారంగధర, జలక్రీడ వంటి ప్రదర్శనలు ఇస్తున్నారు. జానపదాలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి పింఛనుతో పాటు కళాకారులకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించడం, వారు సాధన చేసుకునేందుకు కళావేదికలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కళపై అభిమానంతోనే నేర్చుకున్నా..



పల్లె జీవనానికి ప్రతిబింబమైన జానపద కళలపై అభిమానంతోనే నేర్చుకున్నా. మా గ్రామంలో ఎక్కువ మంది నాటకాలను నేర్చుకున్నారు. గ్రామంలోనే కాకుండా సుదూర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ, జానపద కళలను కాపాడుతున్నారు. ప్రభుత్వం కళాకారులకు తోడ్పాటు అందిస్తే బాగుంటుంది.

-వాసాల రమేష్ రెడ్డి, కర్తలి, కంచిలి మండలం

శ్రీకాకుళంలో స్పెషల్ కోర్టు ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం



మంత్రి మండలి సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు

శ్రీకాకుళం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భారత ఉన్నత న్యాయస్థానం క్రిమినల్ రిట్ పిటీషన్ (క్రిమినల్) నెంబరు 511 ఆఫ్ 2024లో ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా శ్రీకాకుళంలో స్పెషల్ కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలి పింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం విజయవాడలో మంత్రి మండలి సమావేశమైంది. డి.కేశవరావు అలియాస్ దున్న కేశవరావుకు వ్యతిరేకంగా నమోదై విచారణ జరుగుతున్న 16 కేసులపై 7వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు కమ్ స్పెషల్ కోర్టుగా నియమించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులతోపాటుగా జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

దివ్యాంగుల దీనగాథ



(ఐదో పేజీ తరువాయి)

ఆస్పత్రి (జీజీహెచ్-రిమ్స్), టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో దివ్యాంగుల ధ్రువపత్రాల పునఃపరిశీలన చేపట్టింది. కాగా.. రిమ్స్‌కు ధ్రువపత్రాల పునఃపరిశీలనకు వచ్చిన దివ్యాంగులకు అవస్థలు తప్పలేదు. జిల్లా నలుమూలల నుంచి చాలామంది దివ్యాంగులు గురువారం ఉదయం రిమ్స్‌కు చేరుకున్నారు. కానీ వారు కూర్చునేందుకు అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. దివ్యాంగ వృద్ధులు ఊతకర్ర సాయంతో క్యూలో నిల్చొన్నారు. ఆసుపత్రి అధికారులు కానీ, సంబంధింత డీఆర్డీఏ శాఖ సిబ్బంది కానీ పట్టించు కోలేదు. నిజానికి రిమ్స్‌లో బుధ, గురు, శుక్రవారాల్లో రోజుకి 400 మంది చొప్పున పునఃపరిశీలన జరుగుతోంది. గతంలో జరిగిన అవకతవ కల నేపథ్యంలో వైద్యులు కూడా విశాఖపట్నం, టెక్కలి, పాలకొండ, నరసన్నపేట వేరే ప్రాంతాల నుంచి వచ్చి ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారు. ఈ నిజనిర్ధారణ ప్రక్రియలో నలుగురు ఎముకల వైద్య నిపుణులు, ఒక ఈఎన్‌టీ నిపుణుడు, ఒక మానసిక వ్యాధి నిపుణుడు అలాగే ఒక కళ్ల వ్యాధుల నిపుణుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే గురువారం రిమ్స్‌లో నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడం (సాంకేతిక సమస్య), తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా తనిఖీ ప్రక్రియ చాలా ఆలస్యమైంది. ఉదయం 9-30 నుంచి సాయంత్రం 4-30 వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. దీంతో దివ్యాంగులు క్రిందనే కూర్చుని, చతికిలపడిపోయారు. ఎటువంటి సదుపాయాలు లేకపోవడంతో చాలా మంది ఆకలితోనే వేచి చూశారు. ఇక నుంచైనా అధికారులు తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు. వైద్యాధికారులైనా క్షేత్రస్థాయిలో పర్యటించి.. శతశాతం దివ్యాంగుల ఇళ్ల వద్దే సర్టిఫికెట్లను పునః పరిశీలించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలోని ఇదే పరిస్థితి ఎదురైంది. పలువురు దివ్యాంగులు గంటల తరబడి నిరీక్షించి అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పలువురు దివ్యాంగులు వెళ్లారు. తామంతా పింఛన్లకు అర్హత ఉన్నా నోటీసులు అందుతున్నాయని, తమకు న్యాయం చేయాలని ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. అలాగే ఈనెల 25న శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్న 'మీ-కోసం' కార్యక్రమంలో కూడా కలెక్టర్‌కు తమ మొర వినిపించేందుకు దివ్యాంగులంతా తరలిరావాలని ఆ సంఘం అధ్యక్షుడు ఆవల వేణుగోపాలరావు పిలుపునిచ్చారు.



రిమ్స్‌లో నిరీక్షించలేక దివ్యాంగుల ఇబ్బందులు

ఇక స్మార్ట్‌గా..!



- నెలాఖరుకు కొత్త రేషన్ కార్డులు
- క్యూఆర్ కోడ్‌తో రూపకల్పన
- నేతల ఫొటోలు లేకుండానే..
- కొత్త విధానంలోనే రేషన్ పంపిణీ

ఇచ్ఛాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెప్పింది. ఇప్పు డున్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డులను అందించేందుకు నిర్ణయించింది. ఈనెలా ఖరులోగా వీటిని కార్డుదారులకు పంపిణీ చేయనుంది. సెప్టెంబరు నుంచి స్మార్ట్ కార్డుల ఆధారం గానే రేషన్ అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో పౌరసరఫరాల వ్యవస్థను అస్తవ్యస్తమైంది. నాటి పాలకులు అనాలోచిత నిర్ణయాలతో ప్రజా పంపి ణీ వ్యవస్థను నీరుగార్చారు. వాటన్నింటిని సరిచేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకెళుతోంది. అందులో భాగంగానే రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను అందించనుంది.

జిల్లాలో 6.60 లక్షల కార్డులు..

జిల్లాలోని 30 మండలాల్లో 6,60,739 రేషన్ కార్డులున్నాయి. వీటి స్థానంలో కొత్త స్మార్ట్‌కార్డులు అందిస్తారు. వీటితో బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాలు రేషన్ డిపోల్లో విడిపించుకోవచ్చు. వైసీపీ హయాంలో రేషన్ కార్డులపై సీఎం జగన్, ఆపై రాజశేఖర్ రెడ్డి బొమ్మను ముద్రించారు. పైగా డిపోల్లో కాకుండా ఇంటింటికీ రేషన్ పేరుతో ప్రత్యేక వాహనాల ద్వారా అంటూ హడావుడి చేసినా వీధి చివరలో అందించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో విపక్షాలు అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదు. నేతల బొమ్మలను పెద్దవిగా పెడుతూ లబ్ధిదారుల వివరాలను చిన్నవిగా చూపించారు. ఈ నేపథ్యంలో అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విధానానికి స్వస్తి పలికి పారదర్శకంగా సేవలందించేందుకు గాను ఏ రాజకీయ నేత ఫొటో లేకుండా ఈ స్మార్ట్ కార్డులను రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ స్మార్ట్ కార్డుల తయారీ ప్రక్రియ పూర్తయ్యింది. కార్డుపై కేవలం కార్డుదారుల కుటుంబ సభ్యుల పేర్లు మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ స్మార్ట్ కార్డులు ఏటీఎం కార్డు మాదిరిగా ఉంటాయి. ఈ కార్డును జేబులో పెట్టుకుని ఎక్కడికైనా వెళ్లే వెసులుబాటు ఉంటుంది. కార్డుపై ఒకవైపు రేషన్ కార్డు, డిపో నెంబరు, రెండోవైపు కుటుంబ సభ్యుల పేర్లు ముద్రిస్తున్నారు.

ఈనెల 25 నాటికే స్మార్ట్ కార్డులు..



ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని నిర్ణయించింది. తయారైన కార్డులు ఈనెల 25 నాటికే జిల్లా కేంద్రానికి కాకుండా నేరుగా మండలాలకు చేరుతాయి. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. స్మార్ట్‌కార్డులతో సులభంగా, వేగంగా రేషన్ పొందేందుకు అవకాశం ఉంటుంది. గ్రామాల్లో వీఆర్వో ఆథంటికేషన్ బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారులకు కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

క్యూఆర్ కోడ్‌తో..

స్మార్ట్ కార్డుపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. డీలరు వద్ద ఉన్న ఈపోస్ యంత్రంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు కనిపిస్తాయి. దీంతో క్షణాల్లో రేషన్ పంపిణీకి అవకాశం ఉంటుంది. మరోవైపు ఈ ఏడాది మే నుంచి కొత్త రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించింది. వారికి కూడా ఈ స్మార్ట్ కార్డులను ఇవ్వనుంది. స్మార్ట్‌కార్డుల పంపిణీ తరువాతే రేషన్ పంపిణీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

నాన్నా.. ఎందుకిలా చేశావు?

(ఐదో పేజీ తరువాయి)

ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. నరసింహనాయుడు సోదరి సాయి ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. కుమారుడుపైనే ఆశలు పెంచుకుని జీవనం సాగిస్తున్న ఆ తల్లికి ఈ సంఘటన మరింత కృంగదీసింది. తన కుమారుడికి చదువుపైనే ధ్యాస అని, ఇటీవల రెండు నెలల సెలవులకు ఇంటికి కూడా వచ్చాడని, పీయూసీ ప్రథమ సంవత్సరంలో కూడా మంచి మార్కులు సాధించాడని తల్లి రాజులమ్మ పేర్కొంది. ఎందుకిలా చేశాడో తమకు అర్థం కావడం లేదని కన్నీటిపర్యంతమైంది.

రెప్పపాటులో విషాదం

(ఐదో పేజీ తరువాయి)

కోల్పోయామంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. దుప్పిలపాడు, పాకివలస గ్రామాల్లో రోదనలు మిన్నంటాయి. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వంగపండు సత్యనారాయణ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆడపడుచులపై దుష్ప్రచారం దారుణం

● తప్పుడు ప్రచారం చేసే వారిని వదిలే ప్రసక్తే లేదు ● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

అరసవల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లిన ఆడపడుచులపై దుష్ప్రచారం చేసి అసహ్యంగా మాట్లాడుతూ ఒక స్త్రీని అడ్డం పెట్టుకుని నీచ మాట్లాడడం దారుణమని, అటువంటి వ్యక్తిని ఏ ఆడపడుచులూ క్షమించరని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో గల జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయాలకు పాల్పడడం తోక రాజకీయ నాయకునికే చెల్లిందని అన్నారు. చింతాడ రవికుమార్ చేసిన దుష్ప్రచారాలు తప్పని రుజువయ్యాయని అన్నారు. భగవంతుని సన్నిధిలో ఉన్నవారిపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడం, ఫోటోలను మార్ఫింగ్ చేసి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం క్షమించరాని నేరమన్నారు. ఆడపడుచులపై నీచంగా మాట్లాడిన చింతాడను వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై తమకు ఫిర్యాదులు అందాయని.. వాటిని ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. వారు విచారించి, తదుపరి చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో మహా లింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో శివ పంచాయతన సహిత మహాలింగార్చన కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో అర్చకులు, వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, ఆర్.వికాస్‌శర్మ, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం ప్రాజెక్ట్ కార్మికులను ఆదుకోండి



రాజుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'ఉద్దానం ప్రాజెక్ట్‌లో 27 సంవత్సరాలుగా పని చేస్తున్న 77 మంది కార్మికులను అర్ధాంతరంగా తొలగించటంతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మా సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి.. ఆదుకోవాల'ని కార్మికులు జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజును కోరారు. ఇచ్ఛాపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై దాసరి రాజు స్పందిస్తూ వారి సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఎస్సీ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రధాని ఆదర్శ గ్రామ యోజన కింద జిల్లాలోని షెడ్యూల్ కులాల యువతీ యువకులకు భారీ వాహన డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఇందుకోసం జిల్లాకు చెందిన 10 మంది అభ్యర్థులను (పురుషులు-5, మహిళలు-5) ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అర్హులైన ఎస్సీ యువతీ, యువకులు తమ దరఖాస్తులను ఈ నెల 27వ తేదీలోగా జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు.

తపాలా పత్రాలపై రచనా పోటీలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో తపాలా సేవలపై అవగాహన పెంపొందించేందుకు సెప్టెంబరు 30న తపాలా పత్రాల రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు పోస్టల్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబరు 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అది కేఎస్‌పీఎస్‌ఎన్ స్థలమే

పొందూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన 220-4 సర్వే నంబరులో విలువైన 13 సెంట్ల స్థలం కలగర్ల సూర్యనారాయణ శెట్టి (కేఎస్‌పీఎస్‌ఎన్ చౌటరీ) భూమేనని రెవెన్యూ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ట్రస్టు భూమి ఆక్రమణ పేరుతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై కలెక్టర్ నివేదిక కోరడంతో స్థానిక రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. రికార్డులను బట్టి అది ట్రస్టుభూమిగా నిర్ధారించారు. రికార్డులు తారుమారుచేసి 1-బి మంజూరుచేసిన అధికారులపైనా నివేదిక ఇచ్చారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

నరుబుజ్జిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నరుబుజ్జిలి జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపునకు గురువారం శ్రీకారం చుట్టారు. రూ.12 కోట్లతో నాలుగు రోడ్ల అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టినప్పటికీ స్థానికులు అభ్యంతరం తెలపడంతో అధికారులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రోడ్లు, భవనాలు, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇరువైపులా 35 అడుగులు చొప్పున తొలగించి 70 అడుగుల రహదారి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. దీంతో జేఈ ఆంజనేయనాయక్ పర్యవేక్షణలో తొలగింపు పనులు చేపట్టారు.

ఆధ్యాత్మిక సేవలోనే సంతృప్తి

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవలో ఎంతో సంతృప్తి ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని శివబాలాజీ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహా కుంభాభిషేకం గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు ఏవీఎస్ శర్మ, తులసీరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడా మైదానం అభివృద్ధికి కృషి

ఇచ్ఛాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సురంగి రాజా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ సెర్చ్ కమిటీ హెడ్ రవిచలం, జిల్లా క్రికెట్ సంఘ సెక్రటరీ హసన్‌రాజు అన్నారు. గురువారం మైదానాన్ని పరిశీలించిన అనంతరం క్రీడాకారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు దాసరి రాజు, ఐసీసీ సబ్ సెంటర్ మెంబర్ మలీమ్‌ఖాన్, బత్తుల వెంకట రమణ, చాట్ల లోహిదాస్, గణేష్, కోచ్‌లు గోపి, మేఘనాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన అవినీతిమయం

ఆమదాలవలస, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలన అవినీతికి కేంద్ర బిందువుగా మారిందని మాజీ స్పీకర్, వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మినేని సీతారాం ఆక్షేపించారు. గురువారం ఆమదాలవలసలోని తన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి అచ్చెన్నాయుడు అవినీతి దందాలకు పాలపడుతున్న తీరు దారుణమన్నారు. కమిషన్ల కోసం అధికారులపై ఒత్తిడి తేవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ అని వ్యాఖ్యానించారు. వ్యవసాయ యంత్రాల కొనుగోలులో అంచనాలు పెంచాలంటూ ఒత్తిడి తీసుకొచ్చిన విషయాన్ని స్వయంగా ఓ ఉన్నతాధికారి ప్రభుత్వానికి లేఖ రాయడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి అన్నారు. ఈ విషయంపై నిజాలను నిగ్గు తేల్చేందుకు స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సంస్థలతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన యంత్రాల విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు భారీ అక్రమాలకు పాల్పడ్డారని, దీనిపై విచారణ చేపట్టాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పెద్దపాడు వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ యంత్రాల కొనుగోలులో అవినీతి జరిగిందని ఆగ్రో జీఎం రాజా రామ్మోహన్‌రావు విడుదల చేసిన లేఖ చూస్తే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. నిజాయితీ గల అధికారి మంత్రి అచ్చెన్న ఒత్తిళ్లకు తట్టుకోలేక సెలవుపై వెళ్లే పరిస్థితి చూస్తే రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో తెలుస్తోందన్నారు. ఈ సమావేశంలో టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి పేడాడ తిలక్, నాయకులు కిల్లి రామ్మోహన్‌రావు, చింతాడ రవికుమార్, అంధవరపు సూరిబాబు, మెంటాడ వెంకట స్వరూప్, గొండు రఘురాం, ఎం.ఎ.బేగ్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే



వరిపైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్/గార రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం శ్రీకాకుళం రూరల్, గార మండలంలోని వంశధార, నాగావళి నదీ తీర గ్రామాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల పంట పొలాలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్ర, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించండి

సోంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి భాస్కర్ కోరారు. గురువారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1,458 మంది తీవ్రమైన వైకల్యంతో బాధ పడుతున్నారని తెలిపారు. అర్హులైన దివ్యాంగ పెన్షన్లు తొలగించటం చాలా బాధాకరమని అన్నారు. ఈ సమావేశంలో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలిలో...

కంచిలి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలో అర్హులైన దివ్యాంగ పింఛనుదారులకు పింఛన్లు తొలగించారు. వీరంతా పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు గురువారం ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.వీరభద్ర స్వామికి వినతిపత్రం అందజేశారు.

కాజ్‌వే పై వరద నీరు

ఇచ్ఛాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బాహుదా నదిలోకి వరదనీరు చేరింది. తీరప్రాంతమైన బూర్జపాడు కాజ్‌వేపై గురువారం వరద నీరు ప్రవహించటంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చిన్న, పెద్ద లక్ష్మీపురం గ్రామాలతో పాటు శివకృష్ణాపురం, డొంకూరు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇంతలో అధికారులు స్పందించి.. డొంకూరు తీరంలో పొగురుతీత పనులు చేపట్టి నీటిని సముద్రంలోకి మళ్లించటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఎల్‌సీ గేటు వద్ద పనులతో ఇబ్బందులు

పురుషోత్తపురం నుంచి కేదారిపురం, ముచ్చింద్ర వెళ్లే రహదారిలో ఎల్‌సీ గేటు వద్ద రైల్వే సిబ్బంది పనులు చేపట్టడంతో ప్రయాణికులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం పట్టాల పనులు చేసేందుకు రైల్వే గేటు వేసేశారు. దీంతో వాహనదారులు బారులు తీరారు. రైల్వే అధికారులు సమాచారం ఇవ్వకపోవటంతో వివిధ పనులపై ఇచ్ఛాపురం వచ్చిన వారు అవస్థలకు గురయ్యారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గార, రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం సీఐ పైడపునాయుడు అన్నారు. శ్రీకూర్మం గ్రామంలో వ్యాపారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరుగుతున్న అవాంఛనీయ సంఘటనల కారణంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలపై దాడులు, ఆస్తి తగాదాలు తరచుగా జరుగుతున్నాయని... వాటిని సత్వరమే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

పాత శ్రీకాకుళం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించి వివరాల నమోదుకు ఈ నెల 26 చివరి తేదీ అని తెలిపారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విపత్తుల నిర్వహణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజర్ కె.సత్యనారాయణ, క్యాంపస్ అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

విదేశీ విద్యపై అవగాహన

ఎచ్చెర్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో కేసీ ఓవర్సీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విదేశీ విద్యపై గురువారం అవగాహన కల్పించారు. దేశంలోని వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు శివానీ కళాశాలను సందర్శించి విదేశీ విద్యకు ఉన్న అవకాశాలను వివరించారు. వివిధ వర్సిటీల ప్రొఫెసర్లు ప్రణీషా రాకేష్, జాయిద్ షేక్, తనీషా చోప్రా, అంగిత విక్రం, అజ్రా బరోడా వాల, భాగ్యశ్రీ క్రిస్టియన్, నితిన్ జోసెఫ్‌లు వచ్చారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి పి.దుర్గాప్రసాద్‌రాజు, ప్రిన్సిపాళ్లు వై.శ్రీనివాసరావు, రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

పొందూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిల్వలను పసిగట్టేందుకు పొందూరులో గురువారం పోలీసు జాగిలాలతో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

2.70 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని బరంపురంలో కొనుగోలు చేసిన 2.70 కిలోల గంజాయిని రేణిగుంటకు తరలించేందుకు సిద్ధమవుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం సీఐ మీసాల చిన్నమనాయుడు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అనూజ్ కుమార్ రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటూ ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన సాగర్‌తో పరిచయం ఏర్పడింది. సాగర్ ఒడిశా రాష్ట్రం గుమ్మ ప్రాంతానికి చెందిన గంజాయి వ్యాపారి సునీల్ కుమార్‌ను అనూజ్ కుమార్‌కు ఫోన్‌లో పరిచయం చేశాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం బరంపురం చేరుకున్న అనూజ్ కుమార్ గంజాయిని సునీల్ కుమార్ వద్ద కొనుగోలు చేసి ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఇదే సమయంలో పోలీసులు అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా 2.7 కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో గంజాయిని సీజ్ చేసి, అనూజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


ప్రకాశరావు

ఎచ్చెర్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట పంచాయతీ నవభారత్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న బూర్ల ప్రకాశరావు(84) అనే వృద్ధుడు కనిపించడం లేదని ఆయన కుమారుడు వాసుదేవరావు స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశరావు భార్య నెల రోజుల కిదట మృతి చెందడంతో ఆయన మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి చేరలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేస దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎక్కువ కేసులు రాజీకి సహకరించండి



మాట్లాడుతున్న న్యాయాధికారి నిర్మల

టెక్కలి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయేలా సహకరించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. గురువారం కోర్టు సముదాయం పరిధిలో న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాజీకి అనుకూలమైన ప్రతి కేసును పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, పలువురు న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

● మెళియాపుట్టి, రామచంద్రపురం గ్రామంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతున్న న్యాయాధికారి నిర్మల మాట్లాడుతూ.. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్ కూమార్, న్యాయవాదులు వివేక్, కె.బాబురావు, ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగంలో మహారుద్రాభిషేకం


మహారుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

జలుమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో గురువారం మహారుద్రాభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసం మాస శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మహారుద్రాభిషేకం చేశారు. అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శ్రీకృష్ణ, అప్పారావు, శివ, అచ్యుత, యోగి, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై నోటీసులు

కొత్తూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మెట్టూరు బిట్-1 నిర్వాసిత కాలనీకి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తొమ్మిది మందికి నోటీసులు జారీ చేసినట్టు తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. ప్రధాన కాలువకు సేకరించిన స్థలాన్ని ఆక్రమించి గుడి కడుతున్నట్టు గ్రామానికి చెందిన వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారించి నోటీసులు అందజేసినట్టు తెలిపారు.

శ్మశానాన్నీ వదల్లే..

● ఆక్రమణలో కిట్టాలపాడు శ్మశానవాటిక


శ్మశానవాటికకు వెళ్లేందుకు దారికూడా లేని దృశ్యం

హిరమండలం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పల్లెలేదు.. పట్టణం లేదు.. ఎక్కడైనా ఖాళీగా అడుగు జాగా కనిపిస్తే ఆక్రమించేస్తున్నారు. అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. చివరకు శ్మశానాలను కూడా వదలడం లేదు. కిట్టాలుపాడు గ్రామ శివారున ఉన్న శ్మశాన వాటికను కొంత మంది ఆక్రమించి పంట పొలాలుగా మార్చుకొని చక్కగా పంటలు పండించుకుంటున్నారు. పూర్వం పెద్దలు శ్మశానవాటిక కోసం గ్రామం శివారున రెండు ఎకరాలకుపైగా భూమిని కేటాయించారు. ఈ భూమి వంశధార ఎడమ కాలువ పక్కనే ఉండటంతో కరువు కాలంలో కూడా మంచి పంటలు పండుతాయి. దీంతో కొంత మంది అక్రమార్కుల కళ్లు ఈ భూమిపై పడ్డాయి. క్రమేపి ఆక్రమించుకొని గట్టులు వేసి పంట పొలాలుగా మార్చుకున్నారు. ప్రస్తుతం దహన సంస్కరణలు చేసేందుకు కేవలం ఐదు సెంటు స్థలం మాత్రమే మిగిలి ఉంది. మృతదేహన్ని శ్మశానవాటికకు తీసుకు వేళ్లాలన్నా దారిలేకుండా పోయింది. పొలం గట్టుపై నుంచే మృతదేహన్ని కష్టపడి మోసుకుంటూ వెళ్లాల్సి వస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు. గతేడాది ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు సిద్ధమైనా తర్వాత ఏమైందో గాని వెనకంజ వేశారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించి ఆక్రమణదారుల నుంచి భూని స్వాధీనం చేసుకొని శ్మశానవాటికకు కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ హనుమంతురావును వివరణ కోరగా.. పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా కిడ్నీ పరిశోధన కేంద్రం

● ఎమ్మెల్యే గౌతు శిరీష


యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి స్థాయికి తీసుకువెళ్లడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు రూ.2 కోట్ల వ్యయంతో ప్రభుత్వం సమకూర్చిన ల్యాప్రోస్కోపీ సర్జరీ పరికరాలను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో 10 డయాలసిస్ బెడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఏపీట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, నాయకులు గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్‌గుప్తా, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. గురువారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ సాధారణ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఖరీఫ్ నాటికి యార్డులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్‌పర్సన్ పాగోటి ఉమామహేశ్వరి, వైస్ చైర్మన్ గేదెల ఎర్రయ్య, సభ్యులు తంగుడు నాగేశ్వరరావు , సాధు ఆనంద్, కార్యదర్శి పి.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో లక్ష్మణరావు

హరిపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మందస మండలం బేతాళపురం హైస్కూల్ విద్యార్థులకు గ్రామస్థుల సహకారంతో సైకిళ్ల పంపిణీని ఎంఈవో ఎం.లక్ష్మణరావు గురువారం చేపట్టారు. హైస్కూల్ కు చుట్టుపక్కల గ్రామాల నుంచి నడిచి వస్తున్న విద్యార్థుల కోసం గ్రామ స్థులంతా తలో కొంత మొత్తం వేసుకొని 45 మందికి సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికోసం ఉపాధ్యాయు లతోపాటు గ్రామస్థుల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం టీటీ సత్యజిత్‌రాయ్, గ్రామ కమిటీ అధ్యక్షులు కె తెల్లయ్య, ఎం రుషేంద్ర, ఎఎంసీ చైర్మన్ జుత్తు దీపిక, తిమ్మల ఉమామహేశ్వరరావు, జుత్తు అప్పలస్వామి, కె తవిటయ్య, జుత్తు పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం

హిరమండలం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు అభివృద్ధిపై పాలకవర్గం దృష్టి సారించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గురువారం నిర్వహించిన హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా జనసేన పార్టీకి చెందిన మామిడి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా కోవిలాపు కృష్ణమాచార్యతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించాలి

జలుమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు దళారీ వ్యవస్థ నుంచి కాకుండా నేరుగా చెల్లించాలని జిల్లా విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘ ప్రతినిధి వెలమల రమేష్ డిమాండ్ చశారు. కొండపోలవలసలో గల ప్రైవేట్ కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోరుతూ సంబంధిత మంత్రిని కలిసి వినతిపత్రం అందిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ సభ్యులు పట్ట రామచంద్రరావు, బొడ్డేపల్లి రామినాయుడు, కింతలి శంకరరావు, బెండి రాజేష్, కరణం నవీన్, అల్లు తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి సభను జయప్రదం చేయాలి

పాతపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలో ఈనెల 23న నిర్వహించనున్న స్త్రీశక్తి విజయోత్సవ సభను జయప్రదం చేయాలని తెలుగు మహిళా మండల శాఖ అధ్యక్షురాలు అనుమంచిపల్లి శ్రావణి పిలునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కేంపు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ కొల్ల శారద, మాజీ జడ్పీటీసీ సీమ మీనాక్షీదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

పోలాకి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన దీర్ఘాశి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహం ఉపాధ్యాయుడు, దివంగత దుంగో సతారామస్వామి జ్ఞాపకార్థం గురువారం అందజేసినట్టు హెచ్ఎం ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బావన మదన్‌కు రూ5000, బొర్రా శ్యామ్‌కుమార్‌కు రూ3000, లింగుబేరి గోవిందరావుకు రూ2000 చొప్పున అందజేశామన్నారు. ఉపాధ్యాయలు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలని వినతి

పోలాకి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలని పలువురు దివ్యాంగులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గురమణమూర్తిని వారంతా కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే బాధితుల గోడు విని రద్దుచేసిన పింఛన్లను పరిశీలించి పునరుద్ధరించాలని ఎంపీడీవోకి లేఖ రాశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బలగ ప్రకాష్ మాట్లాడుతూ.. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అర్హత ఉంటే న్యాయం చేస్తామన్నారు. పల్లి సూరిబాబు, ఎం.వి.నాయుడు, బైరి భాస్కరరావు, తదితరులు ఉన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

నరసన్నపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పైసా ఖర్చు లేకుండా సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులు నుంచి అనుమతి తీసుకోవాలన్నారు.

● మందస: వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలని కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.క్రిష్ణప్రసాద్ అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, నిబంధనల ప్రకారం అనుమతులు పొందవచ్చునన్నారు. డీజేలు ఏర్పాటు చేయొద్దని స్పష్టం చేశారు.

● సంతబొమ్మాళి: వినాయక చవిత మండపాలకు అనుమతి తప్పనసరిగా నిర్వాహకులు తీసుకోవాలని సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం కోరారు. బలవంతపు చందాలు వసూలు చేయకూడదని రాత్రి పదిగంటల తర్వాత మైక్ సెట్ ఆపుచేయాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

● మెళియాపుట్టి: వినాయ ఉత్సవాల మండపాలకు అనుమతులు తప్పనసరిగా తీసుకోవాలని ఎస్ఐ పిన్నింటి. రమేష్‌బాబు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అమతులు మంజూరు చేస్తామన్నారు.

● సోంపేట: గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సోంపేట ఎస్‌హెచ్‌వో లవరాజు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. మైక్ పర్మిషన్ కోసం సంబంధిత ఏసీపీని సంప్రదించాలని తెలిపారు. విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేస్తారో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పూండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టేందుకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పలాస ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు చెప్పారు. దీంతో పూండి, పాతటెక్కలి, దేవునల్తాడా, అమలపాడు, ఉద్దాన రామకృష్ణాపురం, రెయ్యిపాడు, పీఎం పురం పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● సంతబొమ్మాళి: నౌపడ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ, 33/11కేవీ ఫీడర్లను వరమ్మతులు చేపట్టతుండంతో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టెక్కలి ఈఈ నర్సింహకుమార్ తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

● నరసన్నపేట: ఉర్లాం సబ్‌స్టేషన్ పరిధిలోని చోడవరం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ బాలకృష్ణ తెలిపారు. దీంతో చోడవరం, ముద్దాడపేట, కొబగాం, చెన్నాపురం, నడగాం, గొనపపేట, పారశెల్లి, తెలగవలస, రెల్లివలస, కొల్లవానిపేట, కామేశ్వరిపేట తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు స్పష్టం చేశారు.

● పొందూరు: కింతలి టౌన్ ఫీడర్, దళ్లవలస ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. కింతలి, అచ్చిపోలవలస, సింగూరు, మొదలవలస, బొడ్డేపల్లి, తోలాపి, కనిమెట్ట, దళ్లవలస, ధర్మపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

● లావేరు: అదపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా బ్రేకర్ కోసం పనులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. దీంతో అదపాక, గుర్రాలపాలెం, పాతకుంకాం, కొత్తకుంకాం, పైడాయవలస, భీమునిపాలెం, పెదకొత్తపల్లి, కొత్తూరుపేట, కొత్తకోట, చినకొత్తకోట, భర్నణికాం, పోతాయవలస గ్రామాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

విజయవంతం చేయాలి

పలాస రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గిడుగు రామమూర్తి తెలుగుభాష జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు తెలిపారు. ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయనగరంలో తమ సంస్థ ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామని, చక్కభజన, కోలాటం, బుర్రకథ, దాసులకథ, జముకుల పాటలు కళాకారుల ఆధ్వర్యంలో ప్రదర్శనలు చేపడుతున్నామన్నారు. కోట జంక్షన్ నుంచి ఈ కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభించి వేదిక వద్దకు సాగుతుందని, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

25న మెగా జాబ్‌మేళా

పలాస, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని శ్రీ సాయి శిరీష డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాలో 16 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 750కు పైగా ఖాళీలను జాబ్‌మేళా ద్వారా భర్తీ చేయడం చేయనున్నట్టు తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసి 30 ఏళ్ల లోపు వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైనవారు శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖ, హైదరాబాదుల్లో ఉద్యోగం చేయాల్సి ఉందన్నారు. వివరాలకు 9908590730, 6301045132 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

28 లోగా దరఖాస్తు చేసుకోవాలి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి పసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ కణతి సురేష్‌చౌదరి కోరారు. ఎకరాకు రూ.160 చెల్లించాలని, అలాగే వన్-బీ, ఫోన్ నెంబరు అనుసంధానం ఉన్న ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 28వ లోగా పీఏసీఎస్ కార్యాయలంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఐటీడీపీ అధ్యక్షుడిగా చక్రవర్తి

మెళియాపుట్టి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ మండల అధ్యక్షుడిగా వట్టుకుళ్ల చక్రవర్తి ఎంపికైనట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గత 10 ఎళ్ల నుంచి టీడీపీ సోషల్ మీడియాలో పనిచేసిన అనుభవం ఉండడంతో కలిసివస్తుందని నియమించారు. వైసీపీ ప్రస్తుతం ప్రభుత్వం పై దుష్ప్రచారాలు తిప్పుకొట్టవాల్సిన అవపరం ఉందన్నారు. చక్రవర్తిని పార్టీ నాయకులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు సిలార్ అభినందలు తెలిపారు.

దివ్యాంగుల నుంచి వినతుల వెల్లువ

నందిగాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్లపై రీ-వెరిఫికేషన్ ప్రక్రియ జరగడంతో పింఛన్‌దారులు దరఖాస్తులు అందిస్తున్నారు. ఇప్పటివరకు దివ్యాంగులు బెడ్‌రెస్ట్ కింద పింఛన్ పొందినవారు సచివాలయాల ద్వారా నోటీసులు జారీచేశారు. దీంతో నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు మండల పరిషత్ కార్యాలయానికి దరఖాస్తులు అందిస్తూ మాకు న్యాయం చేయాలంటూ ఎంపీడీవో టి.రాజారావును విన్నవించుకుంటున్నారు.

విద్యా విధానంపై అవగాహన

టెక్కలి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు బేసిక్ సైన్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ జి.వాసంతి ఆధ్వర్యంలో నూతన జాతీయ విద్యావిధానం అధ్యాపకుల అనుభవ పూర్వక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించడం వంటి అంశాలపై రెండురోజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ రమణయ్య, డాక్టర్ రత్నముని తదితరులు పాల్గొన్నారు.

భోజనం రుచిగా ఉండాలి

నరసన్నపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందిస్తున్న భోజనం రుచి, శుచిగా ఉండాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. గురువారం స్థానిక బోర్డు ఉన్నత పాఠశాల, బొరిగివలస ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మోను ప్రకారం ఎండీఎం అందించే బాధ్యత హెచ్‌ఎంలదేనన్నారు. ఎంఈవోలు, పాఠశాలలు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ, హెల్పర్లు జిల్లా వ్యాప్తంగా గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. యూనియన్ ప్రతినిధుల పిలుపుమేరకు ఆయా ప్రాంతాల్లో ఆందోళనలు, ర్యాలీలు, ధర్నాలు, మానవహారాలు చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


అరసవల్లి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు


ఇచ్ఛాపురం: బస్టాండ్ జంక్షన్ వద్ద మానవహారంగా అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన


హిరమండలం: ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు


ఆమదాలవలస: సీడీపీవో కార్యాలయం వద్ద..


పలాస రూరల్: కాశీబుగ్గ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద..



కొత్తూరు: నాలుగు రోడ్ల జంక్షన్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం


పొందూరు: రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు


జలుమూరు: సారవకోట మండల డీటీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం


పాతపట్నం: ఐసీడీఎస్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం


టెక్కలి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు